## క్లుప్తంగా

### నేడు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**అయిజ:** సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని యాపదిన్నెలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ పోటీలను ప్రారంభించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### జాతర పోస్టర్ విడుదల



**రాజోళి:** మండలంలోని మాన్‌దొడ్డిలో జరిగే జాతర ఉత్సవాల పోస్టర్‌ను గ్రామ పెద్దలు ఆదివారం విడుదల చేశారు. గ్రామంలో మాధవస్వామికి ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో లయ కమిటీ సభ్యులు, రైతు సంఘం సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



**గద్వాల అర్బన్:** భావసార్ క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబా భవానీ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఝూడే మధుకర్, ఉపాధ్యక్షుడు కాలిత్కర్ భవాని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్ రావు, సంయుక్త కార్యదర్శి సంతోష్‌కుమార్, కోశాధికారి ఝూడే ప్రభాకర్ రావు, ముఖ్య సలహాదారులు ఝూడే శేఖర్ రావు, రమేష్ రావు, లోక్రే సదానంద రావు, సత్యనారాయణ రావు, కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రావు, ఝూడే జగదీశ్వర్ రావు, కాలిత్కర్ వీరేష్ బాబు, మహేష్, శ్రీను, రాజేశ్వర్ రావు, లక్ష్మణ్‌రావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### దుమ్మురేపుతున్న భారీ వాహనాలు



**అయిజ:** గట్టు మండలంలో నిర్వహిస్తున్న రిజర్వాయర్ నిర్మాణం పనులకు తుంగభద్ర నది నుంచి అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు మీదుగా ఇసుకను తరలించే భారీ వాహనాలు రోడ్లను శిథిలం చేస్తూ దుమ్ము, దూళి రేపుతున్నాయి. రాత్రి సమయంలో వాహనాల శబ్దానికి ప్రజలు నిద్రకు దూరమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### ఆరోగ్య కేంద్రం గేటుకు మరమ్మతులేవి?



**మల్దకల్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏర్పాటు చేసిన గేటు తుప్పుపట్టింది. దీంతో ప్రహరీ పక్కన ఉన్న మరో దారి గుండా ప్రతి నిత్యం వైద్య సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులు రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఆస్పత్రికి ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆవరణలో గొర్రెలు, పశువులు సంచరిస్తూ రోగులు, వైద్య సిబ్బంది నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గేటుకు మరమ్మతు చేపట్టి ప్రహరీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### భయపెడుతున్న దున్నపోతు



**అయిజ:** మండలంలోని ఉత్తనూ రు శివారులో కొ న్ని రోజులనుంచి దున్నపోతు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కనిపించిన మనుషులపై దాడి చేసేందుకు వస్తుండడంతో బాటసారులు, పొలాల్లో పనిచేసే కూలీలు భయపడి పరుగులు తీస్తున్నారు. దానికి సంబంధించిన యజమానులు దున్నపోతును పట్టుకుపోవాలని రైతుసంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. యజమానులు స్పందించకుంటే దున్నపోతును సుదూర ప్రాంతానికి తరలిస్తామని హెచ్చరించారు.

# ప్రమాదాల రహదారి

- 44వ జాతీయ రహదారి
- నిరుపయోగంగా హైవే బస్‌షెల్టర్లు
- మూత్రశాలలు, మరుగుదొడ్ల ఊసేలేదు.
- ట్యాంకులున్నా తాగునీరు లేదు..
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి ప్రధాన కూడలి

**ఎర్రవల్లిచౌరస్తా:** నిత్యం రయ్ రయ్ మంటూ వేలాది వాహనాలు ప్రయాణించే 44వ జాతీయ రహదారిపై సమస్యలు తలెత్తాయి. జాతీయ రహదారిపై ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు అధికారులు నిత్యం రోడ్డును పర్యవేక్షించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణ సమయంలోనే రక్షణ చర్యలతో పాటు, వాహనాలను నిలుపుటకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధాన కూడళ్లలో బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు అత్యవసర వసతులను ఏర్పాటు చేయాలి. 44వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల దగ్గర చార్జీల పేరుతో నిత్యం ప్రతి వాహనానికి దండుకుంటున్నారు. ప్రయాణికుల కోసం హైవేపై కల్పించాల్సిన కనీస వసతులు మాత్రం అధికారులు పూర్తిగా విస్మరించారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నియోజకవర్గంలో రద్దీగా ఉండే కూడళ్లు..**

అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారి బీచుపల్లి బ్రిడ్జి నుంచి పుల్లూరు స్టేజీ వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారిపై మొత్తం 25 బస్‌షెల్టర్లు ఉండగా అందులో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నారు. రహదారిపై బీచుపల్లి, ఎర్రవల్లిచౌరస్తా, కోదండాపురం స్టేజీ, పొగాకు కంపెనీ, మానపాడు స్టేజీ, జల్లాపురం స్టేజీ, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు స్టేజీ వంటి ప్రధాన కూడళ్లు ఉన్నాయి. ఈ కూడళ్ల ద్వారా నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ కూడళ్లలో హైవే అధికారులు కనీస వసతులు కల్పించక పోవడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళా ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

**నిరుపయోగంగా బస్‌షెల్టర్లు**

జాతీయ రహదారిపై హైవే అధికారులు నిర్మించిన బస్‌షెల్టర్లు, తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో కాకుండా సుమారు రెండు వందల నుంచి మూడు వందల మీటర్ల దూరంలో బస్‌షెల్టర్‌లను నిర్మించడంతో అవి ప్రయాణికులకు ఉపయోగపడటం లేదు. అదేవిధంగా బస్‌షెల్టర్ల వద్ద తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపకపోవడంతో ట్యాంకులు ఉపయోగం లేకుండా ఉన్నాయి. కూడళ్లలో కనీస వసతులు కల్పించాలని హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి కనీస వసతులు కల్పించి, ప్రయాణికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



ముళ్లపొదలలోకి చేరిన కొండపేట నీటిట్యాంకు

#### సమస్యలపై దృష్టిసారించాలి..



జాతీయ రహదారిపై ప్రయాణికులకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని చాలాసార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి కూడళ్లలో ప్రయాణికులకు నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలి.

– పెద్ద వీరన్న, వాహనదారుడు

#### హైవేపై వసతులు కల్పించాలి



నిత్యం రద్దీగా ఉండే ఎర్రవల్లి, బీచుపల్లి, అలంపూర్ కూడళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలాలు కూడా లేకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలను నిలపడంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతులు తక్షణమే కల్పించాలి.

– రాజాచారి, ప్రయాణికుడు

## ఆర్‌పీఎఫ్ బలగాల ఫ్లాగ్‌మార్చ్



గద్వాల పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న ఆర్‌పీఎఫ్ బలగాలు

**గద్వాల క్రైం:** గద్వాల పట్టణంలో ఆర్‌పీఎఫ్ బలగాలు ఆదివారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఎదురైన నిర్భయంగా పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు మనోధైర్యం అందించేందుకు పట్టణంలో ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కాంళే వినాయక్, కాశీనాథ్, పట్టణ రెండో ఎస్‌ఐ అబ్దుల్ షూకుర్ ఉన్నారు.

## దేవునికి ఇష్టానుసారంగా జీవించాలి



ధరూర్ ఎంబీ షాలేం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

**ధరూరు:** ప్రతి ఒక్కరూ తమ ఇష్టానుసారంగా కాకుండా దేవుని చిత్తానుసారంగా జీవించాలని పాస్టర్ సీపీ యోధా ప్రసాద్ అన్నారు. జనవరి నెల మొదటి ఆదివారం పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో నడవాలని కోరారు. సంఘానికి, సమాజానికి కట్టుబడి జీవించాలని సూచించారు. మనం చేసే మంచి పనులే మనకు మంచి చేస్తాయన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## హరిత గ్రామాలే లక్ష్యంగా..



ఉమిత్యాల నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

- కేటీదొడ్డి మండలంలో 2.30 లక్షల మొక్కలు
- చురుకుగా సాగుతున్న బ్యాగ్‌ఫీలింగ్ పనులు

**కేటీదొడ్డి:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకానికి నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయా నర్సరీల్లో బ్యాగ్‌ఫీలింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్‌లో తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమానికి మొ క్కలు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా నర్సరీల్లో ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ సిబ్బంది కూలీలకు సూచనలు చేశారు.

**23 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు..**

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో 10 వేల నుంచి 11వేల మొక్కల చొప్పున మండలంలో మొత్తం 2.30 లక్షల మొక్కలు నాటాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.

**ఇప్పటికే 90శాతం పూర్తి..**

గత సంవత్సరం అనువైన నేలలు, నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసి డబ్బు చెల్లించింది. ప్రభుత్వ స్థలంలోనే నర్సరీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ స్థలాలు లేని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలలోని నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ నర్సరీల్లో బ్యాగ్ ఫీలింగ్ పనులు పూర్తి అయ్యాయి. మండల వ్యాప్తంగా 90 శాతం బ్యాగుల్లో మట్టి నింపే పని పూర్తయింది. మరో వారం, పది రోజుల్లో బ్యాగ్ ఫీలింగ్ పనులు పూర్తి చేసి విత్తనాలు నాటేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**పండ్లు, పూల మొక్కలకు ప్రాధాన్యత..**

ఈ ఏడాది నర్సరీల్లో పండ్లు, పూల మొక్కలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌కు అనువైన మొక్కలతో పాటు రైతాంగానికి, రోడ్ల వెంట నాటేందుకు వివిధ రకాల పండ్లు, పూలు వాణిజ్య లాభసాటిగా ఉండే మొక్కలను పెంచుతున్నారు.

#### నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..

మండల వ్యాప్తంగా అన్ని నర్సరీల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్యాగ్‌ఫీలింగ్ పనులు ఇప్పటికి అన్ని నర్సరీలలో పూర్తయ్యాయి. మండలానికి ఈ ఏడాది టార్గెట్ 2.30 లక్షల మొక్కలు కేటాయించారు. రైతులకు అవసరమయ్యే మొక్కలను పెంచుతున్నాం. ఈ పనులు నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– కుమార్, ఏపీఓ, కేటీదొడ్డి

## పీర్ సాహెబ్ దర్గాలో ప్రత్యేక పూజలు



**అయిజ:** మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలోని పీర్ సాహెబ్ దర్గాను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కుల మతాలకు అతీతంగా ప్రజలందరు కలిసి మెలిసి ఉత్సవాలను నిర్వహించడం హర్షించతగ్గ విషయమని అన్నారు. జాతరలు, ఉత్సవాలు, ఉర్సుల గురించి, వాటికి సంబంధించిన చరిత్ర గురించి భా విత రాలకు తెలియజేయాలన్నారు.

## బాధితురాలికి చేయూత



**రాజోళి:** అనారోగ్యంతో బాధపడుతున్న మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కళావతికి సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం చేయూత నిచ్చింది. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కళావతి కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ, థైరాడ్, చర్మవ్యాధులు, రక్త నాళాలకు సంబంధించి దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతోంది ఆమె తండ్రి, సోదరి అనారోగ్యంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు ఆమెను పరామర్శించి రూ.36 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంధ్య, అశోక్, శివప్రసాద్, అయ్యన్న, రాము,కొండలయ్య పాల్గొన్నారు.

## తిప్పగురు ఆలయంలో ఆరాధన ఉత్సవాలు



**గట్టు:** మండలంలోని మిట్టదొడ్డిలో శ్రీ తిప్పగురు స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తిప్పగురుస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆరాధన ఉత్సవాలకు తరలి వచ్చారు. రాత్రి అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**మానవపాడు:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాము తెలిపారు. ఆదివారం మండలంలోని అమరవాయిలో కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు జా గ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు

## వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

**గట్టు:** మండలంలోని మాచర్లలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు జనాలతో కిక్కిరిసి పోయింది. కార్యక్రమంలో సర్పంచు సిద్దిరామప్ప, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు అలీ, సురేష్, రాజుగౌడు, రామకృష్ణ, నర్సింహులు, వినోద్‌శెట్టి, ఆనంద్, మహామూద్ పాల్గొన్నారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## ఇంటింటికీ రాముడి అక్షతలు



రామాపురంలో రాముని అక్షతలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

**మానవపాడు:** అయోధ్య రామ మందిర అక్షతలు ఆదివారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో ఊరేగింపు నిర్వహించారు. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి గ్రామానికి అక్షతలు చేరడంతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దల, ప్రజలు పాల్గొన్నారు.

**శాంతినగర్:** వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షతలను ఇంటింటికి పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ వి నోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు గడప గడపకు వెళ్లి అక్షతలు అందజేశారు.

**కేటీదొడ్డి:** ఈనెల 22న అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్య అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని ఇంటింటికీ అక్షతలు అందజేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉన్నారు.



కేటీదొడ్డిలో అక్షతలు అందిజేస్తున్న భక్తులు

## లక్ష్మి స్ఫూర్తితో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న మహిళా సంఘం నాయకురాలు

**గద్వాల అర్బన్:** చైతన్య మహిళా సంఘం కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి సామాజిక వివక్ష నుంచి స్త్రీకి విముక్తి కల్పించడమే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేసి అమరురాలైందని, ఆమె స్ఫూర్తితో మహిళలు ముందుకెళ్లాలని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో లక్ష్మి వర్ధంతి సభ నిర్వహించారు. మద్యపానం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో అనేక నేరాలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి వంద మందిలో దాదాపు 42మంది మద్యానికి అలవాటు పడుతున్నారని, అన్ని ఉచితాలు ఇచ్చే ప్రభుత్వాలు మద్యాన్ని నిషేధించడమే ప్రధాన సంక్షేమంగా పెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వక్తలు చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, డీటీఎఫ్ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షురాలు సృజన, సీఎల్‌సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబాన్, ప్రధాన వక్త వనమాల, చైతన్య మహిళా సంఘం కో కన్వీనర్ శ్రీదేవి, జిల్లా కన్వీనర్ రేవతి, జయమ్మ ఉన్నారు.

## పట్టపగలే విద్యుత్ వెలుగులు





జిల్లా కేంద్రంలో పగలు పూట వెలుగుతున్న వీధి దీపాలు

**గద్వాల అర్బన్:** గద్వాల జిల్లా కేంద్రంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. సరైన నిర్వాహణ లేకపోవడంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. రాత్రి సమయాల్లో వెలగాల్సిన వీధిదీపాలు పట్టపగలు కూడా వెలుగులు చిమ్ముతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ పొదుపు చేయకపోగా దుబారా చేస్తున్నారు. అయినప్పటికి తమదేం పోతుందనే తీరుగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**రూ.లక్షల్లో బిల్లు భారం**

అధికారుల పర్యవేక్షణ లోపంతో వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. ప్రతిరోజు వీధి దీపాలు వెలుగుతూ వందలాది యూనిట్లు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిరంతరం వెలగడంతో వీధి దీపాలు త్వరగా కాలిపోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

**సుమారు 10వేల వీధి దీపాలు**

పట్టణంలో 37వార్డులు, ప్రధాన రహదారుల్లో మొత్తం సుమారు 10వేలకు పైగా వీధి దీపాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు పురపాలికలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. వీధి దీపాల నిర్వాహణ సరిగ్గా లేక గాడి తప్పడంతో నిరంతరం వెలుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో వీధి దీపాలకు ఆటోమెటిక్ ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలి. సాయంత్రం కాగానే వెలిగి ఉదయాన్నే ఆగిపోవాలి. అలా జరగకుండా పగలంతా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో గద్వాల మున్సిపాలిటీకి ప్రతి నెలా రూ.లక్షల్లో బిల్లు వస్తూ భారంగా మారుతోంది. ప్రతి కాలనీలో ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేస్తే నిరంతరం వెలగకుండా ఉండడంతో పాటు విద్యుత్ బిల్లు తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి దీపాలు నిరంతరం వెలగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

#### చర్యలు తీసుకుంటాం

జిల్లా కేంద్రంలో పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రధాన రహదారుల్లో ఎంసీబీలను ఏర్పాటు చేసి పగటి పూట లైట్లు వెలగకుండా చర్యలు చేపట్టాం. మి గితా చోట సైతం సమస్యను పరిష్కరించేందుకు ఎంసీబీలను ఆర్డర్ చేశాం. అవి రాగానే ఏర్పాటు చేసి పగలు పూట వీధి దీపాలు వెలగకుండా చూస్తాం. కొన్నిచోట్ల డిజిటల్ సి స్టం ఉండంతో ఆపరేటింగ్ సమస్యతో ఆలస్యమవుతుంది.

– మొహమ్మద్ నుస్రత్, మున్సిపల్ ఏఈ

## ఘనంగా మల్లన్న ఉత్సవాలు

**అమరచింత:** పట్టణంలో వెలిసిన మల్లన్న స్వామి దేవర ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సమీపంలోని కృష్ణానదికి వెళ్లి దేవతామూర్తుల విగ్రహాలను అభిషేకించి అక్కడే పూజలు నిర్వహించి జల్దీ బిందెలతో పట్టణంలో ఉత్సవ దేవర్ల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సంవత్సరం ఆలయంలో ఉత్సవాలును నిర్వహించారు.